క్లుప్తంగా

ఆర్‌జేసీ విద్యార్థికి బంగారు పతకాలు


సుప్రియను అభినందిస్తున్న చైర్మన్ కృష్ణ

ఖమ్మంసహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ తాజాగా ప్రకటించిన ర్యాంకుల్లో ఖమ్మం ఆర్‌జేసీ డిగ్రీ కళాశాల విద్యార్థిని సాయివీర సుప్రియ ప్రతిభ చాటి రెండు బంగారు పతకాలు గెలుచుకుందని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమెను అభినందించిన అనంతరం చైర్మన్ మాట్లాడారు. సుప్రియ యూనివర్సిటీ స్థాయి రెండో ర్యాంకు సాధించగా, జూలై 7న జరిగే స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకోనుందని వెల్లడించారు. ప్రిన్సిపాల్ ఎ.లింగయ్య, ఇన్‌చార్జ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న అందె బాబన్న

ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణ అభివృద్ధికి కేంద్ర పథకాలే ఆధారమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబన్న, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. గురువారం ఖమ్మం ఐఎంఏ హాలులో జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. పదకొండేళ్లలో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పోషించిన పాత్ర అపూర్వమని, రాష్ట్రాన్ని ముందుకు నడిపిన ప్రతి ఘట్టానికీ కేంద్ర పథకాలే ఆధారమని పేర్కొన్నారు. సమావేశంలో గోంగూర వెంకటేశ్వర్లు, సున్న రవికుమార్, అల్లిక అంజయ్య, విద్యాసాగర్, ఉప్పల శారద, పుల్లారావు, గుత్తా వెంకటేశ్వర్లు, అత్తి విజయరెడ్డి, రవి రాథోడ్, విజయరాజు, సుదర్శన్, గుగులోతు నాగేశ్వరరావు, భూక్యా శ్యాంసుందర్, బోయినపల్లి చంద్రశేఖర్, ఈదుల వీరభద్రం పాల్గొన్నారు.

మంత్రితో మాజీ ఎమ్మెల్యే సోదరుడు భేటీ

కూసుమంచి: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండలంలోని రాజుపేటకు గురువారం వచ్చారు. కాంగ్రెస్ నాయకుడు రేలా వెంకటరెడ్డి – సునీత కుమారుడు భరతసింహారెడ్డి వివాహం స్నిగ్ధతో ఇటీవల జరగగా వారిని ఆశీర్వదించారు. కాగా, అదే గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సోదరుడు, మాజీ సర్పంచ్ కందాళ సురేందర్‌రెడ్డి తుమ్మల కారును ఆపి తన ఇంటికి ఆహ్వానించారు. పాలేరు ఎమ్మెల్యేగా ఆయన హయాంలో జరిగిన అభివృద్ధిని సురేందర్‌రెడ్డి గుర్తు చేశారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

కామేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లగూడెంలో సీపీఐ 18వ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శిగా తాళ్లగూడెం గ్రామానికి చెందిన పుచ్చకాయల వెంకటేశ్వర్లును, సహాయ కార్యదర్శిగా పుచ్చకాయల వెంకటకృష్ణను ఎన్నుకున్నారు. దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి లతాదేవి, తాటి వెంకటేశ్వర్లు, రామకృష్ణ, శివ, శ్రీను, సత్యనారాయణ, ప్రభాకర్‌రావు, జగ్గయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఖమ్మం నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా గురువారం పరిశీలించారు. 5, 6, 56, 60 డివిజన్లలో డివిజన్‌కు 20 మంది చొప్పున కార్మికులను నియమించి పారిశుద్ధ్య పనులను చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలను వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగస్వాములను చేస్తున్నామని, ప్రజలు ఇంట్లోని వ్యర్థాలను చెత్త సేకరణ వాహనాలకే అందించాలని సూచించారు.

ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం

కామేపల్లి: ఇళ్లు లేని ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే కాంగ్రెస్ లక్ష్యమని డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబుయాదవ్ అన్నారు. గురువారం రుక్కితండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొని మాట్లాడారు.

ప్రారంభమైన పాఠశాలలు

పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయాన్నే పుస్తకాలు సిద్ధం చేసుకుని బడిబాట పట్టారు. పలుచోట్ల పాఠశాలల్లో మామిడి తోరణాలు కట్టి అలంకరించారు. ప్రజాప్రతినిధులు హాజరై తొలిరోజు పాఠశాలలను ప్రారంభించారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.


నగరంలోని కొత్తగూడెం పాఠశాలలో మాట్లాడుతున్న డీఈఓ సామినేని సత్యనారాయణ


ఖమ్మంవన్‌టౌన్: పుస్తకాలు అందిస్తున్న కార్పొరేటర్


ఖమ్మంఅర్బన్: యూనిఫాం అందిస్తున్న శ్రావణి


కూసుమంచి: మామిడి తోరణాల వద్ద విద్యార్థులు


తిరుమలాయపాలెం: విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు


కామేపల్లి: పాఠ్య పుస్తకాలను అందిస్తున్న నరసింహారెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఖమ్మంవన్‌టౌన్: జూబ్లీపుర ప్రాథమిక పాఠశాలలో కార్పొరేటర్, హెచ్‌ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు భాస్కర్, హైమావతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్యశీల, స్వప్న, రమ, నాగలక్ష్మి, నాగమణి, శోభ, రేణుక, శ్రీలత, సంధ్య పాల్గొన్నారు.

ఖమ్మంఅర్బన్: వేణుగోపాలనగర్ యూపీఎస్‌లో కార్పొరేటర్ మోతారపు శ్రావణి, హెచ్‌ఎం గుడిపూడి శ్రీనివాసరావు, జి.జ్యోతి, జి.గోపికుమారి, మానస, సరోజిని, పుష్పమ్మ, కుమార్, రమేశ్, ప్రసాద్, నవీన్, వెంకన్న, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: పలు పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంఈఓ రాయల శేషగిరి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గురువాయిగూడెం పాఠశాలను మామిడి తోరణాలతో అలంకరించారు.

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాగా, పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించొద్దని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పునుకుల సుధాకర్ మండల కమిటీ సమావేశంలో కోరారు. గాదె వరుణ్‌కుమార్, విష్ణు, కృష్ణ, సాయి పాల్గొన్నారు.

అపరిశుభ్రతపై తల్లిదండ్రుల నిలదీత

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. తొలిరోజు పాఠశాలకు పిల్లలను తీసుకొచ్చిన తల్లిదండ్రులకు అపరిశుభ్రత వాతావరణం స్వాగతం పలకడంతో మండిపడ్డారు. మండలంలోని రాయగూడెం జిల్లా పరిషత్ పాఠశాలకు గురువారం తల్లిదండ్రులు పిల్లలతో రాగా మరుగుదొడ్లు, టాయిలెట్లు కంపు కొడుతుండగా, చెత్తాచెదారం కూడా తొలగించలేదు. దీంతో నేలకొండపల్లి సొసైటీ డైరెక్టర్ తీగ రమణయ్య తదితరులు ఉపాధ్యాయులను నిలదీశారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కాగా, ప్రధానోపాధ్యాయుడిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


అపరిశుభ్రంగా ఉన్న టాయ్‌లెట్

పేదల ఇళ్ల స్థలాల జోలికి రావొద్దు..

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ఖమ్మంమయూరిసెంటర్: పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను తిరిగి తీసుకోవాలనే యత్నాన్ని విరమించుకోకపోతే ప్రతిఘటన తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. రఘునాథపాలెంలో సర్వే నంబర్ 218లో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఖమ్మం మంచికంటి హాల్‌లో గురువారం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. భూ పోరాటాల ఫలితంగా 2009లో ఖమ్మంలోని వేలాది మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చినా స్థలాలు చూపించలేదని, ఆపై ఉద్యమిస్తే 2018లో 725 మందికి స్థలాలు చూపించారని తెలిపారు. వీరంతా ఇళ్ల కోసం ఎదురుచూస్తూ, కొందరు బేస్‌మెంట్ వరకు నిర్మించుకున్నారన్నారు. ఈ ప్రాంతంలో 261 మంది స్థలాల మీదుగా నాగపూర్ – అమరావతి హైవేకు సర్వే చేసినా పరిహారం చెల్లించకపోగా, మిగిలిన స్థలాలను ప్రభుత్వం వెనక్కి తీసుకుని విమర్శించారు. యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణానికి 30 ఎకరాలు సేకరించనున్నట్లు చెప్పడం సరికాదన్నారు. ఇకనైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రఘునాథపాలెం మండల అధ్యక్షుడు ఎస్.నవీన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, బాధితులు వై.విక్రమ్, పగడాల నాగరాజు, ఉపేంద్ర సాహు, మేకల శ్రీనివాస్, ఆవుల మంగతాయి, నందిపాటి మనోహర్, తుడుం ప్రవీణ్, పి.రాంబాబు, విజయకుమారి, కృష్ణ, నాగండ్ల శ్రీధర్, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

రైతు ముంగిట శాస్త్రవేత్తలు..


కూసుమంచి: అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: మండల కేంద్రంలో గురువారం రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించగా.. వైరా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)కు చెందిన శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూ.. రైతులు సాగు ఖర్చును తగ్గించుకునేందుకు ఆధునిక పద్ధతులు అవలంబించాలని, యూరియాను తక్కువగా వాడటం వల్ల పంటలకు సోకే తెగుళ్లను తగ్గించవచ్చని పేర్కొన్నారు. అవసరం మేరకే రసాయన ఎరువులు వాడాలని, నేల స్వభావాన్ని కాపాడాలని సూచించారు. డాక్టర్ వి.చైతన్య నీటి ఆదా గురించి వివరించగా మరో శాస్త్రవేత్త ఫణిశ్రీ పంట మార్పిడి లాభాల గురించి రైతులకు వివరించారు. భారతీయ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త పద్మావతి మేలైన వరిసాగు, జిల్లా రైతుసంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు సేంద్రియ విధానంలో సాగు పద్ధతులు, లాభాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూసుమంచి ఏడీఏ సరిత, ఏఓ వాణి, ఏఈఓలు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి

ఖమ్మంరూరల్: వరిలో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని, దీంతో చీడపీడల ఉధృతి తగ్గుతుందని భారతీయ వరి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సీహెచ్ పద్మావతి అన్నారు. మండలంలోని గుదిమళ్లలో గురువారం జరిగిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వరిని ఆశించే దోమ, కాండం తొలుచుపురుగు, ఆకుముడుత, ఉల్లికోడు, కంకినల్లి, అగ్గితెగులు, ఎండాకు తెగులు, పొట్టకుళ్లు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ ఉమానగేశ్, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైద్యశిబిరాలు

తిరుమలాయపాలెం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఎర్రగడ్డ, మేడిదపల్లి గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వంద మందికిపైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 8 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అవినాష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

15న టీజీవోస్ హౌస్ బిల్డింగ్ సమావేశం

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవోస్) మ్యూచువల్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ జనరల్ బాడీ సమావేశాన్ని ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కట్టా శేఖర్, పి.విజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలోని టీఎన్జీవోస్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం మొదలవుతుందని, సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నెలనెలా వెన్నెల..

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 15వ తేదీన సాయంత్రం 6 గంటలకు నెలనెలా వెన్నెల కార్యక్రమం ఏర్పాటు చేశామని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన శ్రీ కృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ కళాకారులు 'అనశ్వరం' నాటికను ప్రదర్శించనుండగా, స్థానిక కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

సేవలు చిరస్మరణీయం

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంమామిళ్లగూడెం: చిరుమర్రి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నల్లగట్ల వెంకట కృష్ణప్రసాద్ విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. గురువారం ఆయన సంతాప సభను వీవీసీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు నివాళులర్పించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. భార్య జ్యోతి, కృష్ణప్రసాద్ అన్నయ్య వెంకటసత్యప్రసాద్, శెట్టి రంగారావు, పాశం గోపాల్‌రావు, వేముల శ్రీనివాసరావు, సీతారాములు పాల్గొన్నారు.

గాయత్రీ హోమం

ఖమ్మంసహకారనగర్: శ్రీ సరస్వతి విద్యాపీఠానికి అనుబంధంగా ఉన్న శ్రీ రామకృష్ణ విద్యాలయంలో కొత్త విద్యాసంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని గురువారం గాయత్రీ హోమం నిర్వహించారు. విభాగ్ అధ్యక్షుడు దేవకి వాసుదేవరావు దంపతులు, పాఠశాల కమిటీ అధ్యక్షురాలు దేవకి రూపావతి హోమం జరిపించారు. రిటైర్డ్ హెచ్‌ఎం రామ్మోహన్, చక్రవర్తుల కృష్ణమాచార్యులు, నెల్లూరి కోటేశ్వరరావు, శేషకుమారి, సుబ్బారావు, శ్రీనివాసరావు, సురేఖ, చంద్రశేఖర్, అండే బాబు, హెచ్‌ఎం సంతోష గౌతమ్ పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ నగర సంఘటన కార్యదర్శి సాయికుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం ఆర్‌ఎం కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, నగర సంయుక్త కార్యదర్శులు వీరభద్ర, అజయ్, మదన్, ఆశిష్, దీపక్, పార్థు, రామ్‌చరణ్, సాయిచరణ్, మొహిద్దిన్ పాల్గొన్నారు.

అన్ని సదుపాయాలు కల్పిస్తాం..

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: వ్యాపారులు, కొనుగోలుదారులకు అనుగుణంగా వీధి వ్యాపారుల ప్రాంగణంలో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం పాత బస్టాండ్ ఎదురుగా వీధి వ్యాపారుల ప్రాంగణంలో అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. రద్దీ దృష్ట్యా మరిన్ని వసతులు కల్పించడమే కాక మార్కెట్ బయట ఉన్న పబ్లిక్ టాయిలెట్లు తొలగించాలని సూచించారు. అలాగే, ప్రహరీ నిర్మాణం, పార్కింగ్ సౌకర్యంపై సూచనలు చేశారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా, ఈఈ కృష్ణలాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు ప్రత్యామ్నాయ స్థలం

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్ శ్మశాన వాటికను మరోచోట ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. వరదల నుంచి రక్షణ కోసం రిటైనింగ్ వాల్ నిర్మించే క్రమాన శ్మశాన వాటికలో కొంత భూమి సేకరించాల్సి వస్తోందన్నారు. ఈ మేరకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూమి గుర్తించి శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ పి.రాంప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ కుమార్ పాల్గొన్నారు.


ఖమ్మంరూరల్: శ్మశానవాటిక మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న సీతారాములు

నేలకొండపల్లి: పలు కారణాలతో ఇటీవల కొందరు మృతిచెందగా వారి కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్థిక సాయం అందించారు. రూ.10 వేల చొప్పున బాధిత కుటుంబాలకు స్థానిక నాయకులు అందించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు మాట్లాడారు. మృతుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు మంత్రి శ్రీనివాసరెడ్డి భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో శాఖమూరి రమేశ్, కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, కుక్కల హనుమంతరావు, మాజీ సర్పంచ్‌లు పెంటమళ్ల పుల్లమ్మ, రాయపూడి నవీన్, వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, బొందయ్య, కోమ్మినేని పుష్పావతి పాల్గొన్నారు.

ఖమ్మంమామిళ్లగూడెం: 30వ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు గొరోజు వసంత్‌బాబుకు ఇటీవల తొంటి శస్త్రచికిత్స జరగగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అతని ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకొని రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

సాయినాథుని నాణేల ప్రదర్శన

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని గాంధీచౌక్ షిర్డీ సాయి మందిరంలో గురువారం సాయినాథుని నాణేల ప్రదర్శన జరిగింది. షిర్డీ సాయినాథుడు భగవంతుడిని చేరేందుకు రూపొందించిన 9 నాణేలను భక్తురాలు లక్ష్మీబాయికి ఇవ్వగా.. ఆమె మృతిచెందిన తర్వాత షిర్డీలోని ఆమె సమాధి వద్ద ఉంచారు. ఈ క్రమంలో లక్ష్మీబాయి బంధువులు ఆ నాణేలను దేశవ్యాప్త ప్రదర్శనలో భాగంగా గురువారం గాంధీచౌక్ సాయి మందిరంలో ఉంచారు. దర్శన కార్యక్రమాన్ని మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో అర్వపల్లి నిరంజన్, కురువెళ్ల జగన్మోహన్‌రావు, పీవీడీ ప్రసాద్, సూర్యనారాయణ, శీలం హనుమంతరావు, బోనగిరి ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శన ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు దంపతులు

ఒకేసారి రెండు మోకాలి చిప్పల మార్పిడి

ఖమ్మంమామిళ్లగూడెం: హైదరాబాద్ మలక్‌పేటలోని యశోద ఆస్పత్రిలో మహిళకు ఒకేసారి రెండు మోకాలి చిప్పల మార్పిడి శస్త్రచికిత్స చేశారు. ఈ మేరకు శస్త్రచికిత్స చేయించుకున్న తుమ్మ నాగమణితో కలిసి ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ ఆర్థో సర్జన్ కృష్ణ సుబ్రహ్మణ్యం గురువారం ఖమ్మంలో వివరాలు వెల్లడించారు. ఏన్కూరుకు చెందిన నాగమణి కాలి నొప్పులతో బాధపడుతుండగా రెండు మోకాలి చిప్పలమార్పిడి శస్త్రచికిత్స ఒకేసారి విజయవంతంగా చేశామని తెలిపారు. తద్వారా మూడు రోజుల్లోనే నడవగలిగే స్థాయికి చేరిందని చెప్పారు. సమావేశంలో జనరల్ మేనేజర్ శ్రీనివాస్ చిదుర, ఆస్పత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణ సుబ్రహ్మణ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్: ప్రస్తుత తరుణంలో పలువురు మత్తుపదార్థాలకు అలవాటు పడి ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారని, అలా కాకుండా సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా సాధన చేయాలని సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి సూచించారు. ఖమ్మం పెవిలియన్ మైదానంలో గురువారం ఆయుష్ ఆధ్వర్యాన యోగా సాధనతో లాభాలపై అవగాహన కల్పించారు. అలాగే, కోచ్ సంధ్యారాణి పలు ఆసనాలను వివరించారు. కార్యక్రమంలో రామనాథం, శ్యామ్‌బాబు, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, సుశీల, చంద్రశేఖర్, వెంకట్, భాస్కర్, రమాశేఖరం, పద్మ, సబిత తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తుల వెల్లువ

ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: భూ సమస్యలపై గ్రామాలు, నగరం పరిధిలో పలు కాలనీల్లో జరుగుతున్న భూ భారతి గ్రామసభల్లో వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. రఘునాథపాలెం మండలం రాంక్యాతండా రైతువేదికలో జరిగిన సదస్సులో 451 దరఖాస్తులు వచ్చాయి. సాదాబైనామా, సర్వే నంబర్ల మార్పులకు సంబంధించిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సదస్సులో 104 మంది దరఖాస్తులు అందించారు. ఖమ్మంఅర్బన్ రెవెన్యూ పరిధిలోని మలిశెట్టినగర్‌లో నిర్వహించిన సదస్సులో 19 మంది దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో సైదులు, శ్వేత, వెంకటేశ్వర్లు, మురళీధర్‌రావు, సాయి నరేశ్, ప్రవీణ్, సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

దారుణంగా చెదిరింది



మండలంలోని కాకరవాయి చెరువు కట్ట సమీపంలోని చప్టా వద్ద రహదారి దారుణంగా తయారైంది. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలు, వరదలతో రహదారి దెబ్బతినగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రాళ్లు తేలి అటుగా వెళ్లే వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – తిరుమలాయపాలెం